సారె ఊరేగింపు



గంగమ్మ ఆలయంలో భక్తుల సందడి



చిన్నారుల బండ వేషధారణ





బండవేషాలతో భక్తుల కేరింత





తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ జాతరలో భాగంగా రెండోరోజు గురువారం భక్తులు బండ వేషాలు ధరించి నగరంలో కేరింతలు కొట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు సందడి చేశారు. చిన్నా పెద్ద తేడా లేకుండా అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రదక్షిణ చేసి మొక్కులు తీర్చుకున్నారు. కొందరు కుటుంబ సమేతంగా ఆలయం వద్ద పొంగళ్లు పెట్టారు. అమ్మవారి మూలవిరాట్టుకు విశేష పూజలు చేశారు. జాతర రెండవ రోజున తాతయ్యగుంట గంగమ్మ బండవేష ధారణలో భక్తులకు దర్శనమిచ్చారు.

నేడు తోటి వేషం : తాతయ్యగుంట గంగమ్మ జాతరలో భాగంగా మూడో రోజు శుక్రవారం తోటి వేషాలతో గంగమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకోనున్నారు. శరీరానికి బొగ్గుపొడి రాసుకుని తెల్లనామం, కనుబొమలపై చుక్క బొట్లు పెట్టుకుంటారు. పిల్లలు మీసాలను కూడా పెట్టుకుంటారు. తలకు రిబ్బన్లు, నడుముకు వేపాకు ధరిస్తారు. పాత పొరకలు, చాట చేతపట్టుకుని ఎదురుపడిన వారిని తిన్నగా మోదుతూ ఊరేగుతారు. బూతు పాటలు పాడతారు. అనంతరం గంగమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారి పాదాల వద్ద వేపాకు, చాట, పొరకలు పడేసి బూతులు తిడుతూ కేరింతలతో సందడి చేస్తూ భక్తి పూర్వంగా మొక్కులు చెల్లించుకుంటారు.



కళాకారుల ప్రదర్శన



గంగమ్మ జాతరలో వైఎస్సార్‌సీపీ నాయకులు



వెయ్.. దరువెయ్..
తప్పెటగుళ్ల కళాకారుల ప్రదర్శన

క్లుప్తంగా

పొలంలోకి దూసుకెళ్లిన వ్యాన్

శ్రీరంగరాజపురం: పొలంలోకి వ్యాన్ దూసుకెళ్లిన సంఘటన మండలంలోని ముద్దుకుప్పం గ్రామం వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పళ్లిపట్టు నుంచి చిత్తూరుకు వస్తున్నా వ్యాన్ చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారి ముద్దుకుప్పం గ్రామం వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్నా విద్యుత్ స్తంభాన్ని ఢీకొని పొలంలోకి దూసుకువెళ్లింది. ఆ సమయానికి రోడ్డుపై ప్రయాణికులు రాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్‌ఐ రాజాకుల్లాయప్ప మాట్లాడుతూ ఎవరైనా వాహనదారులు మద్యం సేవించి, లైసెన్స్ లేకుండా నిర్లక్ష్యంగా వాహనాలను నడిపితే కఠిన చర్యలు తప్పవని వాహనదారులను హెచ్చరించారు. అనంతరం విద్యుత్ అధికారులు యుద్ధప్రాతిపదికన విద్యుత్ స్తంభం మరమ్మతులు చేపట్టారు.

స్వామి కణ్ణన్‌కు డాక్టరేట్



డాక్టరేట్ పొందిన స్వామికణ్ణన్

చిత్తూరు కలెక్టరేట్: పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు స్వామికణ్ణన్‌కు డాక్టరేట్ లభించింది. తిరుపతి జిల్లా శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో రాజనీతి శాస్త్రం, ప్రభుత్వ పాలనా శాస్త్రం విభాగంలో ది రోల్ ఆఫ్ సర్వశిక్ష అభియాన్ ఇన్ ఇంప్రూవింగ్ క్వాలిటీ ఎడ్యుకేషన్ ఎ కేస్ స్టడీ ఇన్ చిత్తూరు డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై పరిశోధన చేశారు. ఆచార్య బీవీ మురళిధర్ పర్యవేక్షణలో పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. డాక్టరేట్ పొందిన ఆయనను డీఈఓ దేవరాజు, ఏడీ విజయేంద్రరావు, వెంకటేశ్వర్లు, డీవైఈఓ చంద్రశేఖర్, పలువురు ఉపాధ్యాయులు,ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందించారు.

నాలుగు మాస్టర్స్ డిగ్రీలు

2013లో ఎస్వీయూ రీసెట్‌లో మొదటి ర్యాంక్ సాధించి అనేక జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పరిశోధన పత్రాలు, సదస్సుల్లో పాల్గొని స్వామికణ్ణన్ అనేక మన్ననలు పొందారు. కేంద్ర ప్రభుత్వం 2002 నుంచి అమలు చేస్తున్న సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు కింద చిత్తూరు జిల్లాలో గుణాత్మక విద్యను వృద్ధి చేయడంలో సమగ్ర పరిశోధన చేశారు. జిల్లాలోని రామకుప్పం మండలం ఆరిమానిపెంట గ్రామంలో నిరుపేద కుటుంబంలో జన్మించిన ఆయన నాలుగు మాస్టర్స్ డిగ్రీలను పూర్తి చేసి ప్రస్తుతం సర్కారు బడిలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

రేపు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లెలో ఉన్న శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శనివారం ఆరాధన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం మహాగణపతి పూజ, హోమ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమ్మ, సిద్ధయ్య మూలవర్లకు మహాభిషేకం, పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్న సమారాధన చేయనున్నట్లు వివరించారు. దైవకార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కాలజ్ఞాని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

టీబీని తగ్గించేందుకే బీసీజీ టీకా



బీసీజీ టీకాను పరిశీలిస్తున్న డాక్టర్ రవిరాజు

నగరి: టీబీ వ్యాధిని తగ్గించేందుకే బీసీజీ టీకా వేస్తున్నట్లు జిల్లా టీకా అధికారి, డాక్టర్ రవిరాజు తెలిపారు. గురువారం నగరి మున్సిపల్, రూరల్ మండల పరిధిలో బీసీజీ టీకా వేసే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని సచివాలయాల్లో ఏఎన్‌ఎంల ద్వారా ఈ టీకా వేస్తున్నామని తెలిపారు. 60 ఏళ్ల పైబడి ఉండేవారికి, పొగ తాగేవారికి, టీబీ ఉండి నయమైన వారికి, బాడీ మాక్స్ ఇండెక్స్ తక్కువ ఉన్నవారికి, టీబీ, షుగర్ వ్యాధులు ఉన్నవారికి ఈ వ్యాక్సిన్ వేస్తున్నామని తెలిపారు. వ్యాక్సిన్ వల్ల సైడ్ ఎఫెక్ట్స్ ఏవీ ఉండవన్నారు. వ్యాక్సిన్ వేసుకోదలచిన వారి అంగీకారం మేరకే వ్యాక్సిన్ వేయడం జరుగుతుందన్నారు. వారి వ్యక్తిగత సమాచారం గోప్యంగా ఉంచడం జరుగుతుందని ఎలాంటి సంకోచాలు లేకుండా టీకా వేసుకోవచ్చన్నారు. పుట్టిన బిడ్డకు ఆ రోజే ఈ టీకా వేయడం జరుగుతోందని అయినా పలువురికి టీబీ సంక్రమిస్తుండడంతో పెద్దలకు కూడా టీకా వేస్తే నిర్మూలించవచ్చని పరిశోధనల్లో తేలినందున బీసీజీ టీకా వేసే కార్యక్రమం జరుగుతోందని తెలిపారు.

60 ఏళ్లకు పైబడిన వారికి వ్యాక్సిన్



ఎట్టేరిలో బీసీజీ వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ దుర్గాదేవి

గంగాధరనెల్లూరు: 60 ఏళ్లకు పైబడిన వారికి బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్నామని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ దుర్గాదేవి అన్నారు. మండలంలోని పాపిరెడ్డిపల్లి, కోటాగరం సచివాలయ పరిధిలోని 60 ఏళ్లకు పైబడిన వారికి టీబీ వ్యాధి నివారణకు వృద్ధులకు గురువారం వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని డాక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. మండలంలోని పలు సచివాలయాల పరిధిలో 395 మంది వృద్ధులకు వైద్యసిబ్బంది వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శ్రీనివాసులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మీ సేవలు ఎప్పటికీ మరవను




తిరుమలరాజుపురం నాయకులను అభినందిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి


- డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పాలసముద్రం: ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో రౌడీలకు, మందు, డబ్బులకు లొంగకుండా వైఎస్సార్‌సీపీ గెలిచేలా కృషి చేసిన ప్రతి నాయకుడు, కార్యకర్తను ఎప్పటికీ మరువనని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. గురువారం ఆయనకు తిరుమలరాజుపురం మాజీ సర్పంచ్ షణ్ముగరెడ్డి, చంద్రకుమార్ ఎన్నికల సమయంలో టీడీపీ వారు చేసిన బెదిరింపులను విన్నవించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో టీడీపీ రౌడీలను దింపి ఓటర్లను బెదిరిస్తూ దిగజారుడు రాజకీయాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ముఖ్యంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను చాలా ఇబ్బందులకు గురి చేశారని, ఇదంతా చంద్రబాబు నాయుడు డైరెక్షన్‌లోనే జరిగిందన్నారు. అయితే జీడీ నెల్లూరు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి థామస్ రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా తమిళనాడు రౌడీలను తీసుకొచ్చి బెదిరించాడని, అయితే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు బెదిరింపులకు భయపడకుండా ఓట్లు వేశారని తెలిపారు. ప్రతి ఒక్కరికీ పాదాభివందనం అన్నారు. అనంతరం తిరుమలరాజుపురం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను అభినందించారు. కార్యక్రమంలో తిరుమలరాజుపురం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు కృషి చేద్దాం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది



ప్లకార్డులతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది


పాలసముద్రం: గ్రామాల్లో దోమలు వృద్ధి చెందకుండా అరికడితే డెంగీ వ్యాధి నుంచి ప్రజలను కాపాడుకోవచ్చని వైద్యాధికారి మోహన్‌కృష్ణ అన్నారు. గురువారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ఆరోగ్య సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దోమలు ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువులన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించి దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాత్రి సమయంలో దోమలు కుట్టకుండా గ్రామీణ ప్రజలు దోమతెరలు వాడాలన్నారు. జ్వరం వస్తే అశ్రద్ధ చేయవద్దని, వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆరోగ్యకేంద్రానికి తీసుకెళ్లాలని తెలిపారు. ముఖ్యంగా ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకుంటే దోమలను అరికట్టవచ్చన్నారు. నిల్వ నీరు ఉన్న చోట మలాథిన్, బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయాలని తెలిపారు. అనంతరం ఆరోగ్యకేంద్రం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుశీల, మురళి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

డెంగీ వ్యాధిని నివారిద్దాం

శ్రీరంగరాజపురం: ''డెంగీని నివారిద్దాం.. ఆరోగ్య సమాజానికి ప్రతిఒక్కరూ కృషి చేద్దాం'' అని మండల వైద్యాధికారులు డాక్టర్ గిరి, సందీప్ అన్నారు. ఈ సందర్భంగా జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ గిరి మాట్లాడుతూ డెంగీ జ్వరం అనేది బాధాకరమైన, బలహీనపరిచే దోమల ద్వారా సంక్రమించే వ్యాధి, డెంగీ జ్వరం వంటి లక్షణాలు అధిక జ్వరం, దద్దుర్లు, తలనొప్పి, కండరాలు, అలసట, అతిసారం, కీళ్లనొప్పులు వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ప్రజలు డెంగీ వ్యాధి నుంచి కాపాడుకోవడానికి దోమతెరలు, ఇంటి పరిసరాల్లో మురుగునీరు చేరకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. డెంగీ లక్షణాలు ఉంటే వెంటనే సమీప ఆరోగ్యకేంద్రంలోని డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. అనంతరం ప్లకార్డులతో ప్రజలకు అవగాహ న కల్పించారు.

ఎన్నికల ఫలితాలపైనే చర్చ

- ఎక్కడ చూసినా ఇదేతీరు
- గెలుపోటములపైనే సమీక్షలు



నగరి: మొన్నటి వరకు గ్రామాలు, పట్టణాల్లో అభ్యర్థుల ప్రచార రథాలు, సభలు, సమావేశాలు, ర్యాలీలు వీధుల్లో తిరుగుతూ హోరెత్తించారు. ఎన్నికల ముందురోజు రాత్రి పంపకాలపై చర్చ జరిగింది. పోలింగ్ ముగియడంతో కార్యకర్తలు, గల్లీ లీడర్లు గెలుపోటములపై బేరసారాలు వేసుకుంటున్నారు. పోలైన ఓట్లు, వచ్చే ఫలితాలు ఎలా ఉంటాయనే ఆలోచనల్లో ఎవరికి వారు అంచనాలు వేసుకుంటున్నారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసిన రోజు నుంచి నియోజకవర్గంలో ఏ నలుగురు గుమిగూడిన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల గెలుపోటములపైనే చర్చ జరుగుతోంది. గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, టీస్టాల్, బస్టాండ్, హోటళ్లు, కార్యాలయాలు, దుకాణ సముదాయాలతో పాటు ఉపాధి పని ప్రదేశాలు, చెట్ల నీడలు, రచ్చబండ వద్ద ఎక్కడ చూసినా ఒక ప్రధాన పార్టీ గెలుస్తుందని, లేదు మరోపార్టీనే గెలుస్తుందని చర్చించుకుంటున్నారు. తొలి నుంచి అక్కడ పార్టీకి బాగుండేది చివరిరోజు మారిందని కొందరు లేదు. ఒక పార్టీకి అక్కడ సాలిడ్‌గా పడిపోయిందని కొందరు, అక్కడ ఏజెంట్లే లేదంటే ఫుల్‌గా ఓట్లు వేసేశారంటూ ఎవరికి తోచిన విధంగా వారు చెప్పేస్తూ చర్చించుకుంటున్నారు. కొందరు చెప్పేవి అయితే వీరు ఓటింగ్ మిషన్ పక్కనే నిలబడి చూశారా? అనే స్థాయిలో ఉంటోంది. దీంతో పాటు కొంత రాజకీయాల మీద ఆసక్తి ఉన్నవారు మీ నియోజకవర్గంలో ఎలా ఉంది ? ఎవరు గెలుస్తారని ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారి బంధువులకు ఫోన్లు చేసి మరీ తెలుసుకుంటున్నారు. కొందరు నాయకులు చేసిన అభివృద్ధి, అభ్యర్థుల వ్యక్తిత్వం, వ్యతిరేకత, పంపిణీ చేసిన నగదు తదితర అంశాలపై అంచనాలు వేసుకుంటున్నారు. ఎంత చర్చించుకున్నా చివరకు చూద్దాం జూన్ 4వ తేదీ తెలిసిపోతుంది ప్రజలు ఏవైపు వేశారో అంటూ ముగించేస్తున్నారు.

గురుదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో స్వామివారు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం గురుదక్షిణామూర్తికి ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి పలురకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో ఎస్వీ నాగేశ్వర రావు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

19న శ్రీకాళహస్తి మహత్యం గ్రంథావిష్కరణ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర క్షేత్ర పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం పెద్ద శ్రీకాళహస్తి మహత్యం గ్రంథం ఆవిష్కరించనున్నట్లు సమితి గౌరవాధ్యక్షుడు సింగరాజు ప్రకాశం శాస్త్రి, అధ్యక్షుడు అట్ల పురుషోత్తం గౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని కైకాలవారిసత్రంలో ఆరోజు సాయంత్రం నాలుగు గంటలకు అష్టదిగ్గజ కవుల్లో ఒకరైన ధూర్జటి కవి ముని మనమడు లింగరాజు కవి విరచిత తాళపత్ర లిఖిత పెద్ద కాళహస్తి మహత్యం గ్రంథ ఆవిష్కరణ ఉంటుందని పేర్కొన్నారు. భాషాభిమానులు, కవులు, రచయితలు, ప్రజలు పెద్దసంఖ్యలో విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కేబుల్ దొంగ పట్టివేత

పలమనేరు: పొలాల వద్ద కేబుళ్లను చోరీ చేసి, వాటిని కాల్చి, అందులోని రాగి వైర్లను విక్రయించి జల్సా చేసే ఓ దొంగోడిని గురువారం రైతులు పట్టుకున్న సంఘటన మండలంలోని ముసలిమొడుగులో చోటుచేసుకుంది. వివరాలు.. రెండు నెలలుగా ముసలిమొడుగు గ్రా మ రైతుల పొలాల వద్ద కేబుళ్లు చోరీకి గురయ్యాయి. దీనిపై బాధిత రైతులు స్థానిక పోలీసులకు ఫిర్యాదులు సైతం చేశారు. అయినా చోరీలకు అడ్డుకట్ట పడలేదు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి పొలాల వద్ద కేబుళ్లను కా ల్చిన వాసన రావడంతో రైతులు వెళ్లి చూడగా, అప్పటికే కాల్చి అందులోని కాపర్, అల్యూమినియంను తీసుకెళ్లినట్టు గుర్తించారు. అంతకు ముందు పొలాల వద్ద అనుమానాస్పదంగా సంచరించిన యానాది మల్లికార్జున అలియాస్ మల్లు ఈ పనులు చేసి ఉండవచ్చని అనుమానించారు. దీంతో రైతులంతా కలసి గురువారం పొద్దున్న అతన్ని పట్టుకుని తమదైన శైలిలో నిలదీసేసరికి ఇంతకాలంగా కేబుళ్లను చోరీ చేసింది తానేనని చెప్పాడు. దీంతో రైతులు అతడిని స్థానిక పోలీసులు అప్పగించారు.

పంటలపై ఏనుగుల దాడి



ఏనుగుల దాడిలో దెబ్బతిన్న టమాట పంట

పెద్దపంజాణి: మండలంలోని పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. కొంత కాలంగా పెద్దకాప్పల్లి పంచాయతీ పరిధిలోని అటవీ సరిహద్దు గ్రామాలైన కొత్తబూరగపల్లె, తిప్పిరెడ్డిపల్లె, పెద్దకాప్పల్లె, పెనుగొలకల, ముదిరెడ్డిపల్లె, గౌరీనగర్, జిట్టంవారిపల్లె, ఆకులవారిపల్లె గ్రామ రైతుల పంటలను నాశనం చేస్తున్నాయి. బుధవారం రాత్రి కీలపట్ల ఫారెస్టు బీటు నుంచి వచ్చిన ఏనుగులు ముదిరెడ్డిపల్లె పంట పొలాలపై పడి నష్టం కలిగించాయి. ఈ దాడుల్లో టమాట పంటలు ధ్వంసమయ్యాయి. గురువారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు పంటలు చూసి తీవ్ర ఆవేదనకు గురయ్యారు. బాధిత రైతులు అగిస్టి, ఈశ్వరయ్య మాట్లాడుతూ, రూ.50వేల పంట నష్టపోయినట్లు కన్నీటిపర్యంతమయ్యా రు. ఏనుగుల దాడుల్లో దెబ్బతిన్న పంటలను రాయలపేట ఫారెస్టు బీట్ ఆఫీసర్ రవికుమార్ పరిశీలించారు. వివరాలను ఉన్నతాధికారులకు పంపి నష్టపరిహారం మంజూరుకు చర్య లు తీసుకుంటామని తెలిపారు. ఏనుగుల దాడుల నివారణకు శాశ్వత చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా రైతులు కోరారు. ఏటా పంట దిగుబడులు వచ్చే సమయంలో దాడులు చేస్తుండడంతో భారీగా నష్టపోతున్నట్లు తెలిపారు.